# శిల్పి

"దేశిరాజు"

●

ఆనీరసించిన దేహంతో యింట్లనీడల ఆధారంతో ఎక్కడికో సాగిపోతున్నాడు పాపం అతను.

అతను అందమయినవాడే...బి.ఎ. వరకూ చదివేడు. విజ్ఞానవంతుడు...కాని తిండికి, బట్టకి వాచిపోయాడు.

మేనమామ కూతురు దుర్గని ప్రేమించాడు. ఆమెకూడా యితన్ని ప్రేమించింది. యిద్దరూ వలపుతోటల్లో చిలిపిగా, వెకిలిగా నవ్వుకుంటూ దాగుడుమూతలు ఆడుకున్నారు...నిండారు జాబిల్లిలో, మత్తురేరాణిలో ప్రేమతత్వం గ్రహించేరు...కాని పాడులోకం సహించలేకపోయింది

అతడు బీదవాడు. దమ్మిడీలేదు. 'మీపిల్ల కష్టాలుపాలవుతుంది. ఒద్దు. ఆ సంబంధం మానుకోండి.' యిదీ సమాజపుమాటలు. నాటుకున్నాయి మానవహృదయంలో. అదే! అంతే...

అతను యింట్లోనుండి వెళ్ళిపోయాడు...దుర్గ బ్రతిమాలింది...సంతతధారాపాతంగా ఏడ్చింది...మొండిపట్టు పట్టింది...బావనే పెళ్ళిచేసుకుంటాను అంది...కాని లాభంలేకపోయింది...

మానవజీవితం కష్టాలకు గురికావాలికాబోలు...అందులోనే లోకచరిత్ర యిమిడివుంది కాబోలు. వెన్నెలదినాలు కనుమూసి తెరచినంతలో దాటిపోతాయి...చీకటిరాత్రుళ్లు, గుడ్డిగా, మొండిగా, కుంటుతూ సాగుతాయి...

ఆ మలుపుతిరిగినంతలో ఆ ఆసుపత్రి నర్సు అగుపడింది. ఆమెసహవాసం కోరేడు. ఆమెది ఒంటరిజీవితం. ఇతన్ని ఆహ్వానించింది. ఇద్దరూ కిలకిలా నవ్వుకుంటూ కాలాన్ని తోసుకుపోతున్నారు.

గొప్ప శిల్పాకారుడయ్యాడు. తత్ ఫలితంగా ధనార్జన చేస్తున్నాడు. జీవితం సాఫీగా వెళ్లుతోంది.

ఇద్దరూ, ఒకర్ని ఒకరు తెలుసుకోకుండా ప్రేమించుకున్నారు.

ఆమె అతన్ని భర్తగా ప్రేమించింది...

అతడు ఆమెను స్నేహితురాలుగా, పైగా చెల్లిగా ప్రేమించాడు...

ప్రేమరహస్యం తెలుసుకోలేకపోయారు...

కాలచక్రం గిరగిరా తిరుగుతోంది. మూడు వసంతాలు దాటిపోయాయి. ఎన్నో పండువెన్నెల రాత్రుళ్లు దొర్లిపోయాయి. తమ క్షణాలు గిరగిరా మన్నాయి.

చిత్రాలు ప్లాష్టరుతో చేయడానికి పూనుకున్నాడు. పోటీపందేనికి నిల్చేడు. ఇరవైవేలు బహుమతి...కష్టదినాలు తొలగిపోయాయి అనుకున్నాడు పిచ్చిగా...బహుమతి యితనిదే అని మేడలుకట్టేడు.

ఒకనాటి రేయి...

'సరోజా' ముద్దుగా పిల్చాడు. దొమ్ముమీద పమిట తొలిగింది...అరమోడ్పు కనులతో.

'రాజూ' అంటూ పైమీద వ్రాలింది. 'చెల్లి' అని మనసులో సంతృప్తిపడ్తాడు. రెండుజతల పెదిమలు కలసిపోయాయి.

'ఒక్కకోర్కె' ఆశగా అభిమానంగా అడిగేడు.

'సరే కోరు.' ప్రేమతో తలవూపింది.

అవూపులో మత్తుమరువం మైమరపుచేసింది.
'నేను పోటీపందేనికి నిలబడ్డా...నీఅందం నన్ను ఆకర్షించింది...ఓ నెల ప్రతిమలా నిలబడాలి నాకోసం.'

చెప్పేడు...సమ్మతించింది.

మరునాడు మొదలు నెలరోజుల వరకూ ఓపికతో నిలబడింది...చిత్రం పూర్తిఅయింది..నగ్నంగా

నిలబడిన సరోజమీదకి మనస్సు ప్రాకలేదు. ఆశ్చర్య పోయింది...

పాపం! ఆచిన్ని హృదయానికి యితగాడి హృదయం యింకోరికి అర్పితంఅయిందని ఏంతెలుసు.

నేటికి మూడురోజులుంది పోటీదినం...'నేను మిమ్మల్ని ప్రేమించా.' మన్నిస్తూ దగ్గరగా చేరుతూ ఆరోజురాత్రి డాబాపైన వెన్నెల్లో అడిగింది. కళ్లు చకొల్లా తిరిగేయి. సమాధానంకోసం తత్తరపడింది.

'భార్యగా నిన్ను నేను ప్రేమించలేదు...చెల్లీ నా హృదయం యింకోరికి అర్పితంఅయింది. ఈ యిరవై వేలులో నీవి పదివేలు...మిగతా సొమ్ముతో నేను వివాహం చేసుకుంటా.'

కారుమబ్బులు కమ్మేయి...భయంకరరూపం దాల్చింది ప్రకృతి...

చరచరా మెట్లుదిగి వెళ్ళిపోయింది సరోజ... దీనంగా, మౌనంగా కూర్చున్నాడింకా యితడు.

దభీమని చప్పుడయింది...విగ్రహం మీదుగా పడిపోయింది ... ముక్కముక్క అయిపోయింది ... కొయ్యబారిపోయాడు...

ఆడది యెంతకయినా సాహసిస్తుంది.

పోటీరోజు దాటిపోయింది...

ఆమెహృదయం యితనికి అంకితంఅయింది...

ఇతని హృదయం దుర్గని అన్వేషిస్తోంది...

దుర్గ సమాజపు కట్టుబాటులోవుంది...

ఇదేకాబోలు ప్రేమపరిణామం...

ఆమె నర్సు!

ఇతనికోసం మంచంపట్టింది...మూన్నెళ్లు తీవ్ర జ్వరం...నిమ్మోనియా...

ఈ లోకాన్ని, యితన్ని...అందర్నీ తిట్టు కుంటూ సాగిపోయింది పరలోకానికి శాంతికోసం.

అంతమందీ 'ఛీ' అంటే ఆమె నిలవడానికి చోటుయిచ్చింది...ఇతను ఆమెకోర్కను తీర్చలేక పోయాడు...

రెండు కన్నీటిచుక్కలు రాల్చేడు...పాపం! మళ్ళీ అంధకార అమవాశ్యల్ని ఆహ్వానించాడు...


# తేడా

డబ్బు నిలవచేసుకొనడం మీ జన్మహక్కు. డబ్బు నిలవచేసుకోవడానికీ, నిలవచేసిన సొమ్మును అందుకొనడానికీ తేడావుంది.

మీ జీవితభీమా డబ్బు కూడబెట్టడమే కాదు, మీకుగాని మీ కుటుంబానికిగాని అత్యావసరమైనపుడు ఆ మొత్తం అక్కడ వుంటుందికూడాను.

## యునైటెడ్ ఇండియా
## లైఫ్ అష్యూరెన్స్ కో., లిమిటెడ్

యునైటెడ్ ఇండియా లైఫ్ బిల్డింగ్స్,
ఎస్ప్లనేడ్ :: మదరాసు.
బ్రాంచీలు, ఏజన్సీలు దేశమంతటా వున్నవి.

గిరగిరా రోజులు దొర్లిపోయాయి...పాపం నర్సు! అని విచారించాడు...యింకెందుకు...

– రోజులు వ్యతిరేకంగా వున్నాయి.

బికారిగా, చింపిరిజుట్టు, మాసినగెడ్డం, చిరుగుల చొక్కా, మారినగొంతుక, యెండినదేహంతో ఓ కుండ చేత్తోపట్టుకొని మాదవకవళం అడుక్కుంటున్నాడు...యిప్పుడు.

పాపం అతను! ఆరోజు ఆ గుమ్మందగ్గర, ఆకలితో 'అమ్మా' అని అరిచేడు.

ఇంట్లోనుండి 'ఎవరూ' అన్న స్వరం వినబడింది.

'ఆకలివేస్తోంది ... పట్టెడన్నం' కళ్లు తిరిగేయి వొళ్లు చెమ్మగిల్లింది.

లక్ష్మి కలకల్లాడుతోంది ... పచ్చగుమ్మం ... పచ్చతోరణం...ఎవ్వడూ యింతేకాబోలు.

ఆమె వెండికంచంలో అన్నంపట్టుకొచ్చింది. వెనక నాలుగేళ్ల అమ్మాయి. తల్లికొంగుపట్టుకొని మారాంచేస్తోంది.

కుండలోపోసింది పులుసూ అన్నం...చిలిపిగా. గట్టిగా వెనకఅమ్మాయి కొంగు పట్టుకొని లాగింది. ఆతొందర్లో చేతిలోకంచం జారి కుండమీద పడింది...కుండ ముక్కముక్క అయిపోయింది పాపం!

పాపం అతనుచూస్తూనే కిందవాలిపోయాడు, సొమ్మసిల్లి శాశ్వతంగా కళ్ళుమూసేడు.

ఆమె తిరిగిచూపింది...నోటంట నురుగులు... కెవ్వునకేక వేసింది...ఇరుగూ పొరుగూ 'పాపం చనిపోయాడు' అన్నారు...

వెండికంచం తీయబోయింది. యింట్లో అదే! ఆ చిరుగుల చొక్కాగూడా ఎన్నాళ్ళబట్టో నలిగిపోయి యిప్పుడా కంచంలోపడింది.

అది...రాజు బి. ఎ.

దుర్గ ముక్కుమీద వేలువేసుకొని అలానే నిలబడిపోయింది...అలా యెంతకాలం జరిగిందో పాపం!




# రతిరత్న మాత్రలు

దంపతులు సంయోగంవల్ల పొందే ఆనందం లోకంలో యింక దేనివల్లా రాదు. తృప్తిగా అటువంటి ఆనందాన్ని పొందేవారు దేవత్వాన్ని అనుభవించినవారౌతారు. మీరు సదా యౌవ్వనులై తనివితీర దాంపత్యసుఖ మనుభవించాలంటే మీ జీవితంలో ఒకప్పుడు రతిరత్న మాత్రలు వాడాలి. దీనిగుణం శాశ్వతం. ఇది గుండెకు గాని, ఆరోగ్యానికి గాని చెడుపుచేయదు. దీని సేవనవల్ల ఆశా, ఆనందమూ, ఏమీలేక జీవించే కళేబరాలలాంటి జీవితాల్ని కూడ సరిచేసి అద్వితీయమైన ఆనంద మనుభవింపచేసింది. ఉత్సాహమూ, బలమూ పోయి దేనికీ పనికిరాని నిర్జీవమైన నిరాశాపరులకు కూడ అద్భుతశక్తి కలిగించి స్త్రీ సుఖ మనుభవింప తత్తరపడ చేసింది. కలలో మాత్రంతోపోయే శుక్లనష్టాన్ని పోగొట్టి ముసలివారికి కూడ యౌవ్వనమొసగే సాటిలేని ధాతుపుష్టి మందని ప్రశంసలు పొందింది. కనుక మీరు ఎంతబలహీనులైనాసరే భోజనానంతరం ఒక మాత్ర తీసుకుంటే గంటలో నరములకు శక్తి కలిగింస్తుంది.

10 రోజులకు రు. 2-8-0; 20 రోజులకు రు. 4-8-0

40 రోజులకు రు. 8-0-0 (వి. పి. చార్జి 0-12-0)

ఉత్తరములు రహస్యముగా వుంచబడును.

అంగదౌర్బల్యములున్నవారికి "రతిరత్న తైలం" పైపూతకు. చిన్నసీసా రు. 2-0-0; పెద్దది రు. 3-8-0.

**మెడికల్ ప్రాడక్ట్సు**

79. వరదాముత్తియప్పన్ వీధి, మద్రాసు